మీక్స ఆ అడ్రసుకుపరిగెత్తికెళ్ళి మళ్ళీ ఇరవై నిమిషాలలో ఉత్సాహంగా తిరిగివచ్చాడు. "ఆమె అక్కడవున్నది—కులాసాగా! దయచేసి మీ ఫీజెంతో చెప్పండి" అని అడిగాడు మీక్స జగ్గిన్సును.

"రెండు డాలర్లివ్వండి చాలు!" అన్నాడు జగ్గిన్సు. మీక్స ఫీజు చెల్లించి వెళ్ళాక షాంరాక్ జోన్సు టోపీ చేతపట్టుకుని నుంచుని జగ్గిన్సును ఇలా ప్రశ్నించాడు. "మీకేమీ శ్రమలేకపోతే— ఏమీ అభ్యంతరంలేకపోతే..."

"ఎబ్బే—ఏమీ అభ్యంతరంలేదు. నేను దీన్ని ఎలా కనుక్కోగలిగానో చెబుతాను వినండి. మీరు విన్నారుగా మిసెస్ స్నైడర్ వర్ణనను? తను వారంవారం చెల్లించాల్సిన అద్దెలు వగైరాలు ఇవ్వలేక బాధపడే ఒక బీద మధ్యవయస్కురాలైన స్త్రీనిగదా ఆ వర్ణన నిరూపిస్తున్నది? అట్లాంటి మనుషులు ఎక్కువగా నివసించే ఈ దేశంలోకల్లా పెద్దదయిన ఒక ఫ్యాక్టరీ ఈ ప్రాంతంలోనే ఉంది తెలుసా? అక్కడికి సరాసరి వెళ్ళి, ఈమెపేరు ఉదహరిస్తూ విచారించాను. అక్కడ బట్వాడా పుస్తకాలలో ఈమె అడ్రస్ దొరికింది. అంతే!" అన్నాడు.

---

కథానిక

# వయోజన విద్యాశిబిరం

## అవసరాల రామకృష్ణారావు

"గ్రామ పెద్దలారా! మేమొక మహా కార్యాన్ని తలపెట్టి ఇక్కడకొచ్చాం!"

"అలాగా, సాప్పు! సాప్పు!" నోటిలో చుట్ట తీసి తుబుక్కుని పక్కనే ఉమ్మి మునిగాళ్ళ మీద కూర్చుని అడిగాడో కాపు.

"తప్పురా తలుపులు మావా! ఆర్ని కడకంటు సెప్పనీ-మజ్జెలో నువ్వేటి?" అని విసుక్కుంది పక్కనున్న పడుచుపిల్ల. ఊరిమధ్య నూకాలమ్మ గుడిపక్క రావిచెట్టుక్రింద ఆ పల్లెటూరు పెద్దా, చిన్నా అందరూ పోగై, కొత్తగా వచ్చినవారిని వింతగా చూస్తూ, వారి కబుర్లు తమాషాగా వింటున్నారు.

"సోదరులారా, మనం చాలా విచారకరమైన పరిస్థితిలో ఉన్నాం. లోకంలో ఎక్కడేం జరుగుతోందో మనకి తెలీదు-దీనికి కారణం మనకి అక్షరజ్ఞానం లేకపోడమే. మనకి ఓ ఉత్తరం ముక్క రాయడం రాదు. ఓ దరఖాస్తు పెట్టడం రాదు, ఆఖరికి సంతకం చెయ్యడమేనా రాదు. ఇలా నూతిలో కప్పలా జీవితం వెళ్ళబుచ్చడం మీకు విచారకరంగా లేదా? ఇతర దేశాలతో పోల్చిచూస్తే - మనదేశంలో చదువుకున్నవాళ్లు నూటికి... నూటికి ...అబ్బా ...నూటికి...యెంతెంత మేస్టారూ?" విద్యార్థులందరూ కష్టపడి నవ్వాపుకుండావున్నారు. లెక్చరరుకి నిజంగా కోపమే వచ్చింది.

"అన్నిటికీ నేనూ ఉన్నానంటూ తయారవుతావ్, నీకు జనరల్ నాలెడ్జి అయినా సరిగ్గా లేదోయ్ బుచ్చిరెడ్డీ! నువ్వు కంటిన్యూ చెయ్ రాధాక్రిష్ణా!"

"నాకుమాత్రం ఆ 'ఫిగర్' సరిగ్గా ఏం తెలుసునండీ మేస్టారూ?-సరే విన్నారా మహాజనులారా! మా సోదర విద్యార్థి చెప్పిందీ? మన దేశంలో అక్షరాస్యులు చాలా తక్కువ. కాబట్టి మన మందరం చదువుకోవాలి. చిన్న పిల్లలకి చదువు చెప్పడానికి చిన్నచిన్న బడులున్నాయి. కాని పెద్దవాళ్లు, మీకేవీ? రోజూ పేపరు చదువుకుని ఏనాటి వార్తలు ఆనాడు తెలుసుకుంటూంటే ఎంత హాయిగా ఉంటుందీ!"

"రేడియో ఉండదిగా!" అన్నాడు చటుక్కున ఓ కుర్రాడు. దీనికేం జవాబు చెప్పాలో స్టూడెంటుకు తోచలేదు.

"రేడియో ... ఉంటే...ఉంటేమాత్రం... ఏం చెప్పను మేస్టారూ?" ఈసారి మిగతా విద్యార్థులు గొల్లున నవ్వేరు. లెక్చరరు లేచి

కోపంగా "ఉంటే ఉంటుంది-దాని దారి వేరు-నువ్వు చెప్పు ప్రభాకరం." అన్నాడు.

"ఇంతకీ మా లక్ష్యం ఏమిటంటే - మాకు వీలయినంత కృషిచేసి ఈ వూరి పెద్దలందరకీ చదువు చెప్పడం!"

"ఇంతాచేస్తే యిదిగదా? ఛస్! ఓ బుర్రకత కాదు, హరికతా కాదు. ఓ ఏసాలయినా కావు పదండో హోయ్..." అయిదు నిమిషాల్లో ఉపన్యాసవేదిక ఊడ్చేసిన వరిచేనులా తయారయింది!

"సోదరులారా-మామాట పూర్తిగా వినుడు—రేపు ఎనిమిది మొదలు-పదిహేనో తారీకువరకూ రోజూ సాయంకాలం ఆరుమొదలు రాత్రి పది వరకూ పాఠములు చెప్పబడును!" ఉన్నవాళ్ళు కూడా లేచి వెళ్ళిపోతున్నారు. సెక్రటరీ హఠాత్తుగా లేచాడు.

"రేపు రాత్రి ఏడింటికి ఇదే స్థలమందు మిఠాయి పంచిపెట్టబడును" చిన్నపిల్లలు గెంతులేసుకుంటూ ఈ మాట పెద్దలతో చెప్పడానికి పరిగెత్తేరు.

"సెక్రటరీ?"

"ఏం మేష్టారూ?"

"నీకెంత తోస్తే అంత అనెయ్యడమే?"

"మరేం చెయ్యమన్నారూ? మనం గొంతుక తడారిపోయేలా అరిచినా అందరూ పరారిఅయి, స్థలం ఎడారి అయిపోయింది. ఏదో ఎట్రాక్షన్ క్రియేట్ చెయ్యాలిగా మరి? కాలేజీ సేంక్షన్ చేసిన సొమ్ముందిగా?"

"అది యిలాగేనా ఏమిటి ఖర్చుపెట్టడం?—ఇంక ముందూ వెనక ఆలోచించవ్—సరే, పదండి లాడ్జికి—వంటవాడేడీ?"

"ఈ పక్కనెక్కడో తమలపాకుల తోట ఉందిటగా చూద్దామని వెళ్ళేడు!"

"గొప్ప పనిచేశాడు-చెప్పక్కర్లేదూ? ఇంక భోజనాలు ఏ పదకొండింటికో, ఈ స్టూడెంట్సునీ స్టాఫ్‌నీ కూడగట్టుకు రాలేక నా తలప్రాణం తోకకి వస్తోంది!" అని విసుకున్నాడు లెక్చరర్.

"మేష్టారు ఇంత కష్టం ఊరికేపడతారా? ఆ పండి ఊరికే పోనిచ్చుకుంటారా?" అన్నాడు ఓ స్టూడెంటు మెల్లిగా.

"ఏటి గైరమ్మొదినా, బలే, మసాలా ఓసనేస్తోంది!"

"ఎవరూ? నువ్వా బుల్లెంకన్నా, రా! మరేం లేదు. మా పెద్దోడికి రెండు మట్టగిడసలు దొరికితేనూ, రెండుల్లిపాయలేసి అవి వుడకేసినాను. ఏటి యిసేసాలూ? ఎలాగుందీ మిటాయీ?"

"మాపటికి నువ్ రానేదేటీ?"

"మా బుల్లోడికి ఒళ్ళెచ్చగా ఉంటే రానేదు. ఏం జరిగిందీ?"

"ఏం జరగడమేటి పెద్దగొడవై పోనాది-ఊరందరూ అక్కడే ఉన్నాం. పాపం అందరికీ మిఠాయి యిచ్చినోరుసుమా!"

"సదువేమైనా సెప్పినారా?"

"ఏంసెప్పను గైరమ్మొదినా-సెపితే నమ్మవ్ గాని - నిన్న ఉదయం పొలానికి ఎల్లేక మళ్లీ సాయంకాలమే రాడం. ఏతాలు తోడితోడి ఒల్లు పులిసిపోనాది. మనోళ్ళకున్న సుకమే ఆ నిద్ర. ఆ మిటాయితిని యింక ఒళ్ళెగరమనుకో-అందరూ అంతే-మనపోతురాజు నేడూ వాడిని ఓ కుర్రాడు లేపాడు. ఆ నిద్రలోలేచి కొట్టబోయాడు. ఆకరికి అరికూడావచ్చిన పెద్దమనిసీ చెబితే తమాయించాడు."

"అయినా నిద్దర్లో నేపడమేటి?"

"మరే తొంగునోడిచేతిలో లేపి పలకెట్టడమేటి సెబుదూ?"

"మరేఁ అయితే బుల్లెంకన్నా యీరెందుకొచ్చినట్టూ?"

"అదిగదే అర్థమవడంనేదు. మరేటో ఆరుద్దేశం. కడుపులో ఏ వుద్దేశం లేకపోతే ఊరికే పిలిచి యీళలీశలు మిటాయి పంచిపెడతారా?"

"ఏమో! రేపు కరణంగారి సావిడిలో దీని సంగతి మనోళ్ళంతా మాట్లాడదామనుకుంటున్నారు. నువ్వొస్తావ్ కదూ! వెడతా గైరమ్మొదినా."

"సరేలే బుల్లెంకన్నా".

* * *

"కారులేసుకుని-ఊరు దూచుకొని
చక్కగ షైరులు కొట్టాలోయ్
ఎం చక్కా షైరులు కొట్టాలోయ్"

ప్రభాకరం బల్లమీద చేత్తో మద్దెల కొడుతూ పాడుతున్నాడు. స్టూడెంట్సంతా అక్కడ పోగయ్యారు.

"ఈ ఊరి బతుక్కి కారొకటా? ఛా, యింత మరీ పల్లెటూరేమిటోయ్-ఒక్క ఎంగేజిమెంటు లేదూ?" అన్నాడు సుదర్శనం.

"మనం అందుకోసం వచ్చామా ఏమిటి?" అన్నాడు సెక్రటరీ.

"నేను ఉన్నమాటలూ నాలుగూ అనేస్తాను. ఎవరూ ఏడవకండి-స్వతంత్రం వచ్చాక ఏదో ఊడపొడిచేస్తున్నామన నలుగురూ అనుకోడానికి గవర్నమెంటు యిలాంటి యింపాజిబుల్ ప్రొపోజల్సు చేస్తూంటుంది. అవి పత్రికల్లో పడ్డానికేగాని సొమ్ముకొంత విసిరెయ్యడమేగాని—అది సద్వినియోగమయిందో లేదో - ప్రజలేమైనా ముందుకి వస్తున్నారో లేదో దానికక్కర్లేదు. ప్రపంచమంతా 'నువ్వొకందుకు పోస్తూంటే నేనొకందుకు తాగుతున్నానన్నే' రకమైతే ప్రగతి ఎక్కడిదీ? నిజంగా చెప్పాలంటే మన లెక్చరర్‌కి యిందులో యింట్రస్టు ఉందా? పరీక్షలముందు రెండ్నెల్లపాటు ఒక్క బీదవిద్యార్థికి ఊరికే ప్రైవేటు చెప్పగలడా?-నీమాట చెప్పాలంటే 'సెక్రటరీ' గాడివి నీ కిందులో బెనిఫిట్ ఏమిటి? 'సోషల్ సర్వీస్ లీగ్' సెక్రటరీ అని పెద్ద అక్షరాలతో కాలేజీ మేగ్జయిన్‌లో నీ ఫోటో పడాలని కాలేజీగరల్స్ అదిచూసి ఐస్ అయిపోవాలనీ- అంతేనా?"

లెక్చరర్ కేకేశాడు. సెక్రటరీ వెళ్ళిపోయాడు. రామక్రిష్ణారావు అన్నాడు మళ్ళీ:

"ఒరే - ఆడది మా మదర్ ఒక్కమాట అడిగింది. 'ఏదైనా మంచిపని తలపెట్టడం ఊరికే కబుర్లు చెబుతూ కూర్చోడంకన్న ఎప్పుడూ మంచిదే- కాని ఏడాదికి ఒక్కనెలపాటు వాళ్లకి ఏవోనాలుగు ముక్కలు చెబితే ముసిలాళ్ళకి ఏం జ్ఞాపకముంటాయి'? అని. దీనికి జవాబు చెప్పమను?" సుదర్శనం అందుకున్నాడు.

"బ్రాగా చెప్పేవు-ఇవాళ చెప్పిన న్యూటన్సులా మనకి మర్నాడు జ్ఞాపకముండవే... శలవలిస్తే యింక ఆ పేర్లే మరిచిపోతామే అలాంటి వాళ్ళను అల్లరిపెట్టి, బెదిరించి, బుజ్జగించి 'చంటిపిల్లాడికి అన్నం తినిపించినట్టు' తినిపిస్తే ఎక్కుతుందా?"

"మంచి ఉద్దేశం ఉన్నవాళ్లు కొద్దిమందేనా లేరని నా అభిప్రాయం కాదు..." ప్రభాకరం ఉరుకోలేకపోయాడు.

"చాల్లేవోయ్! ఇంక ఆగు... అరగంటనుంచి చూస్తున్నాను. ఏమిటా బోరింగూ? మన నీలాచలరావుగార్ని మించి పోయావే!— సరదాగా రన్మోరు ఆడుకుందాం రండి."

"అలాగే- పేకతెయ్యి వస్తున్నా... నూర్నారాయణా, ఓ సిగరెట్టుందా?"

"ఇంద."

"పర్ స్మోకింగ్?"

"నీలా వాచీ సిగరెట్టుపెట్టెలో 'త్రీ కేసిల్సు' పెట్టే రకంకాదు,"

"వెయ్యండోయ్—రాత్రి ఎలాగా తప్పదు బోరింగు."

* * *

ప్రభాకరం "ఓట్ ఆఫ్ థేంక్స్" చెబుతున్నాడు.

"సోదరులారా! ఈ రోజున మేము మా వయోజన విద్యాశిబిరం ఎత్తివేస్తున్నాము. మీలో కొందరికైనా అక్షరజ్ఞానంకలిగి బాగుపడినందుకు సంతోషం. మీలో ఎవరికైనా కొంచెం సంస్కారమున్నా మాకృషిని ప్రశంసిస్తారని మా నమ్మకం. ఎలాగో అలా 'చేదుమందు'లా మీలో కొందరైనా యీ బోధని కష్టపడి వంటబట్టించుకున్నందుకు మీకు నాతరఫునా, మా బృందం తరఫునా మా లెక్చరరు తరఫునా ధన్యవాదాలు. కార్యక్రమం ముగిసిందీ- అయితే చిన్న మనవి- మీలో పెద్దలు కొందరూ, మేమూ అందరం ఫొటో తీయించుకోవాలి."

"ఫొటో ఎత్తిస్తారంట!"అని ఆడా మొగా అందరూ కోలాహలంగా స్టూడెంట్సుని చుట్టుముట్టేశారు.

ఇలా తేనెటీగల్లా మూగి లాభంలేదు-ఫొటోగ్రాఫరు నలిగిపోతున్నాడు— ఎవరో కొందరే రండి!"

జనం యింకా ఎక్కువయ్యారుకాని తగ్గలేదు. అయితే యీ అతివృష్టి క్షణంలో అనావృష్టి అవుతుందని ఎవరూ ఊహించలేదు.

"స్వామీ మహానానంద!" అందరూ యిదే అరుపులతో చింతచెట్టువైపు పరుగెట్టేరు. అయిదు నిమిషాల్లో నూకాలమ్మ గుడిప్రక్క లెక్చరరూ ఫొటోగ్రాఫరూ మిగిలేరు! స్టూడెంట్సుసహా అక్కడికి పోయారు.

"మిమ్మల్ని శ్రమపెట్టినందుకు యీ రెండు రూపాయిలూ తీసుకుని వెళ్ళిపోండి మూర్తిగారూ, తరువాత నేను మీ జైహింద్ స్టూడియోకొచ్చి ఆ చుట్టుప్రక్కల నలుగురు జనాన్నీ చవగ్గా మాట్లాడుకొని ఫొటో తీయించుకుంటానుగా!" ఫొటోగ్రాఫరు నవ్వుకుంటూ "స్వామి మహానానంద"ని ఫొటోతీసి వారపత్రికకు పంపుదామని అటు వెళ్ళేడు. లెక్చరరూ అటు వెళ్ళక తప్పలేదు!

"నోట మాటే ఆడంట మారాజు!"

"ఆ మొగాన్న సూడే ఎంతెలుగో ఓలప్పా!"

"ఏటిచ్చినా ఒద్దండాడంట!"

దారిలో ఈ మాటలు విని ఆ యోగి ముఖం చూద్దామని లెక్చరరుకి ఎంతో అనిపించింది. స్వామి కాళ్ళదగ్గిర అరటిపళ్ళూ, కొబ్బరికాయలూ డబ్బులూ, గుట్టలుగా పడున్నాయి.

"వీళ్ళకి చదువూ సంధ్యలూ అక్కర్లేదు. విజ్ఞానపు వెలుగుని వీళ్ళ కళ్లు చూడలేవు. వీళ్ళకింతసేపూ మోసం కావాలి!" అనుకున్నాడతను.

"తంవరలా కళ్ళుమూసేసి ఓమాటేనా ఆడకుండా ఉంటే ఎట్టాసామీ?" లెక్చరరు శివశంకరం యోగివైపు చూశాడు. పక్కన నవ్వుకున్నాడు. అమ్మో-ఈ స్వామి మహానానంద్ధం-వరసకి వాళ్ళ బావమరిది అయిన బాచిగాడా? తర్వాత వాణ్ణి ఏకాంతంగా కలుసుకున్నాడు.

"ఏంరా బాచిగా ఎప్పట్నించీ విద్య?"

"ఉష్-నెమ్మది-ఏం చెయ్యమన్నావ్? కడుపు పూర్తిగా నిండకపోతే గంపెడు విద్యలు!—అయినా నేను వాళ్ళకేమీ మంచిచేస్తానని చెప్పుకుని బయలుదేరలేదు. నా వృత్తిలో నీలా ఆత్మవంచన లేదుగా?"

లెక్చరరు చాలా బాధపడ్డాడు. అర్థాపేక్ష ఉన్నా తన ఆశయం నెరవేరలేదు. అతనింకెప్పుడూ "వయోజన విద్య"కి నాయకత్వం వహించలేదు!

---

# హృదయగానం

"వేముగంటి"

పదునెక్కిన హృదయపుటం
విదళించిన ఆవేశం
విశ్వకుహర వీధుల్లో
వెచ్చదనం పూరిస్తుంది-
ఆర్ద్రాలోచనోద్దీర్ణపు
అశ్రుమాలికా గీతం
మూగవడిన కవిగళాన
రాగం ప్రమోగిస్తుంది-
పేదవారి జీవితాల్లో
క్రోధించిన గాథావళి
చరిత్రలో రక్తవర్ణ
మౌక్తికాలు చిత్రిస్తని-
క్రాంతిదేవతా పదాల
రవళించే మంజీరం
భువనభవన రంగంలో
నవసృష్టిని లగిస్తుంది-
ఇరుల పురిటి నొప్పులతో
దురపిల్లు ఉషోగర్భిణి
దెసలల్లోవే వెల్గుల
పసిపాపను ప్రసవిస్తుంది.